

శిక్షణ పూర్తి చేసుకున్న షాబాద్ మండల ఉపాధ్యాయులతో మండల విద్యాశాఖ అధికారి లక్ష్మణ్ నాయక్

# బోధనలో సాంకేతికతను అలవర్చుకోవాలి

- ముగిసిన ఉపాధ్యాయుల ఐదు రోజుల కెపాసిటీ బిల్డింగ్ శిక్షణా కార్యక్రమం
- ఎంఈవోలు లక్ష్మణ్‌నాయక్, సర్దార్‌నాయక్

షాబాద్, మే 24 : బోధనలో వినూత్న పద్ధతులు, సాంకేతికతను అలవర్చుకోవాలని ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ అన్నారు. షాద్‌నగర్‌లోని ఢిల్లీ వరల్డ్ స్కూల్‌లో జరుగుతున్న షాబాద్ మండల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల ఐదు రోజుల కెపాసిటీ బిల్డింగ్ శిక్షణా కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంకేతికత, నూతన బోధన పద్ధతులను ఉపాధ్యాయులందరూ తెలుసుకోవాలన్నారు. విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలతో పాటు మారుతున్న సాంకేతికతను విద్యార్థులందరికీ అందేటట్లు కృషి చేసేది ఉపాధ్యాయులేనని పేర్కొన్నారు. శిక్షణా కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులందరూ తెలుగు, గణితం, ఇంగ్లిష్, ఈవీఎస్‌కు సంబంధించిన ఎన్నో నూతన బోధనా పద్ధతులు, అదేవిధంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఏ విధంగా బోధన చేయాలనే విషయాలు, సాంకేతికతను విద్యాబోధనలో ఏ విధంగా ఉపయోగించాలి, విద్యార్థుల సంఖ్య పెంచడానికి తీసుకోవలసిన తగు చర్యలు, విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు పెంపుదలకు దోహదపడే అంశాల గురించి ఉపాధ్యాయులకు నేర్పించడం జరిగిందని తెలిపారు. ఉపాధ్యాయులు ఎంతో చక్కగా విద్యాబోధన చేస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన ద్వారా విద్యార్థుల్లో ఎన్నో సృజనాత్మక అంశాలు వెలికితీయడంలో ప్రభుత్వ పాఠశాలలు ముందుంటాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘం నాయకులు, సబ్జెక్టులవారీగా రిసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు పూర్తి

మాడ్గుల : ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణా తరగతులు శనివారం పూర్తయ్యాయని మాడ్గుల ఎంఈవో సర్దార్‌నాయక్ అన్నారు. మాడ్గుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణా తరగతులు 5 రోజులపాటు జరిగాయని చెప్పారు. మండలం నుంచి 80 మంది ఉపాధ్యాయులు, 8 మంది ఆర్పీలు పాల్గొన్నారని తెలిపారు. విద్యారంగంలో మారుతున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు వినూత్నంగా బోధించాలని ఎంఈవో సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో సర్దార్‌నాయక్

## శంకర్‌పల్లి మున్సిపాలిటీకి ఉత్తమ పర్యావరణ అవార్డు

చేవెళ్ల రూరల్, మే 24 : చేవెళ్ల నియోజకవర్గం శంకర్‌పల్లి మున్సిపాలిటీకి ఉత్తమ పర్యావరణ అవార్డు వరించిందని కమిషనర్ యోగేశ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని 5 మున్సిపాలిటీలతోపాటు శంకర్‌పల్లి మున్సిపాలిటీ పర్యావరణ పరిరక్షణలో ఉత్తమ పనితీరు కనబర్చడంతో ఈ అవార్డు దక్కిందన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 5న నగరంలోని సనత్‌నగర్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆడిటోరియంలో ఈ అవార్డు అందించనున్నారని తెలిపారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగి మరింత అంకిత భావంతో మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తామని కమిషనర్ యోగేశ్ తెలిపారు.

## పశువులను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

**చేవెళ్ల ఎస్సై సంతోష్‌రెడ్డి**

చేవెళ్లటౌన్, మే 24 : బక్రీద్ పండుగకు సంబంధించి సరైన పత్రాలు లేకుండా పశువులను అక్రమంగా తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చేవెళ్ల ఎస్సై సంతోష్‌రెడ్డి హెచ్చరించారు. ఎవరికైనా విషయం తెలిస్తే వెంటనే చేవెళ్ల పోలీస్‌స్టేషన్ ఫోన్ నం.9440627356, ఎస్సైలు శిరీష 8712663441, సంతోష్‌రెడ్డి 8722663442లకు సమాచారం అందించాలన్నారు.



అన్మాస్‌పల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న భాస్కర్‌రెడ్డి, నాయకులు

## పేదల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం

కడ్తాల్, మే 24 : పేదల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తున్నదని ఆమనగల్లు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని అన్మాస్‌పల్లి, సాలార్‌పూర్, ఏక్వాయిపల్లి గ్రామాల్లో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, నాయకులున్నారు.

## హైటెన్షన్ వైర్ల తొలగింపు ప్రక్రియ బీఆర్ఎస్ హయాంలోనే..

**బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దేవేందర్‌యాదవ్**



సమావేశంలో మాట్లాడుతున్న దేవేందర్‌యాదవ్

కొత్తూరు, మే 24 : మున్సిపాలిటీ పరిధిలోని ఆరో వార్డులో 33 కేవీ హైటెన్షన్ వైర్ల తొలగింపు ప్రక్రియ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ప్రారంభమైందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దేవేందర్‌యాదవ్ అన్నారు. మున్సిపాలిటీలోని ఆరో వార్డులో విద్యుత్ సమస్యపై బీఆర్ఎస్ నాయకులు శనివారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాము మున్సిపల్ ఎన్నికల్లో హామీ ఇవ్వకున్నా హైటెన్షన్ వైర్ల కింద ఉన్న ప్రజలు ఇబ్బందులు పడొద్దని మళ్లింపు ప్రక్రియ ప్రారంభించామన్నారు. మళ్లింపు ప్రక్రియకు సంబంధించిన డీడీ తామే కట్టామని చెప్పారు. అలాగే 8 విద్యుత్ స్తంభాలు, వాటికి కావాల్సిన వైర్లు తామే తెప్పించామని చెప్పారు. ఎన్నికల్ కోడ్ కారణంగా కొన్ని పనులు మిగిలిపోయామని చెప్పారు. సమస్య ఇరవై ఏండ్ల నుంచి ఉందని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారని.. ఇరవై ఏండ్ల కింద కాంగ్రెస్ ప్రభుత్వం లేదా అని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ వచ్చాకనే సమస్య పరిష్కారానికి మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ శ్రద్ధ చూపారని.. దగ్గరుండి అధికారులతో మాట్లాడారని చెప్పారు. మిగిలిన చిన్న చిన్న పనులు చేసి క్రెడిట్‌ను వారి ఖాతాలో వేసుకోవాలనుంటున్నారని పేర్కొన్నారు. వారు చేసిన పనులు వారు చెప్పుకుంటే తప్పులేదు కాని తమ పనులను కూడా వారి ఖాతాలో వేసుకోవడమేంటని ప్రశ్నించారు. మున్సిపాలిటీలోని ఆరో వార్డు అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే ఎంతో కృషి చేశారన్నారు. సీసీ రోడ్లు, అండర్ డ్రైన్లు తదితర పనులు చేపట్టామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రవీందర్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



పరీక్షా కేంద్రానికి సమయానికి చేరుకోవాలి

## పరీక్షా కేంద్రానికి సమయానికి చేరుకోవాలి

**రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి**

ఆదిబట్ల, మే 24 : గ్రామ పాలన అధికారి పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు సమయానికి కేంద్రానికి చేరుకోవాలని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. శనివారం ఆయన అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. సీఎస్ఎల్‌పే మార్గదర్శకాలను అనుసరించి ఈ సూచనలు కచ్చితంగా పాటించాలన్నారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్‌ను ముందుగా డౌన్‌లోడ్ చేసుకుని, అందులో ఉన్న వ్యక్తిగత వివరాలు సరిగ్గా ఉన్నాయా లేదా అని పరిశీలించాలి. అలాగే పరీక్ష కేంద్ర చిరునామాను ముందుగానే గుర్తుంచుకోవాలి. రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను తీసుకురావాలి. వాటిలో ఒక దాన్ని నియంత్రణాధికారి కంట్రోలింగ్ ఆఫీసర్ సంతకం చేసిన హాల్‌టికెట్‌పై అంటించాలి. మరో ఫొటోను పరీక్ష గదిలో పర్యవేక్షకుడికి అప్పగించాలి. మొబైల్ ఫోన్లు, డిజిటల్ వాచీలు, పెన్‌డ్రైవ్‌లు తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్ష హాలులో నిషేధించబడ్డాయి. బ్లూ లేదా బ్లాక్ కలర్ బాల్ పాయింట్ పెన్ మాత్రమే తీసుకురావాలి. జెల్ పెన్‌ను ఉపయోగించరాదు. పరీక్ష గదిలో అభ్యర్థులు నిశ్శబ్దంగా ఉండాలి. పర్యవేక్షకుల సూచనలకు పూర్తిగా సహకరించాలి. పరీక్ష హాలులో నియామావళికి విరుద్ధంగా ప్రవర్తించినవారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోబడును. పరీక్షా కేంద్రానికి అభ్యర్థులు ఉదయం 10 గంటల లోపు తప్పనిసరిగా చేరుకోవాలి. నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతి నిరాకరిస్తారు. ఎంప్లాయిస్ గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని కలెక్టర్ సూచించారు.

# శుభకార్యానికి వెళ్తూ.. అనంత లోకాలకు..

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం



మృతులు అశోక్‌నాయక్ (ఫైల్), అరుణ్ (ఫైల్)



ప్రమాదంలో దెబ్బతిన్న ద్విచక్రవాహనం

యాచారం, మే 24 : మండల కేంద్రంలో గుర్తు తెలియని వాహనం ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో ఓ శుభకార్యానికి వెళ్తున్న ఇద్దరు యువకులు దుర్మరణంపాలయ్యారు. ఈ ఘటన యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిరుమలేశునిగుట్ట సమీపంలో నాగార్జునసాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. సీఐ నందీశ్వర్‌రెడ్డి కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం, పల్లెచెల్కతండాకు చెందిన విస్లావత్ అశోక్‌నాయక్ (22), నల్లగొండ జిల్లా కొండమల్లెపల్లి మండలం, దంజిలాల్‌తండాకు చెందిన రమావత్ అరుణ్ (24) వరుసకు బావబావమరుదులు. ఇద్దరు ద్విచక్రవాహనంపై హైదరాబద్ నుంచి పల్లెచెల్కతండాలో జరిగే ఓ శుభకార్యానికి హాజరయ్యేందుకు వస్తున్నారు. మండల కేంద్రంలోని తిరుమలేశునిగుట్ట సమీపంలోని మూల మలుపు వద్దకు రాగానే ఓ గుర్తు తెలియని వాహనం ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొట్టడంతో వీరిరువురికి తీవ్రగాయాలయ్యాయి. అశోక్‌నాయక్ అక్కడికక్కడే మృతిచెందగా, 108లో చికిత్స నిమిత్తం దవాఖానకు తరలిస్తుండగా అరుణ్ మార్గమధ్యంలో మృతిచెందాడు. రోడ్డు ప్రమాదానికి కారణమైన గుర్తు తెలియని వాహనాన్ని గుర్తించడానికి పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురికీ తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## మా భూములు మాకే ఇవ్వాలి



తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న బాటసింగారం రైతులు

అబ్దుల్లాపూర్‌మెట్, మే 24 : 50 సంవత్సరాల నుంచి వర్షాధారంగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమ భూములు తమకే ఇవ్వాలని బాటసింగారం గ్రామ రైతులు శనివారం తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. సర్వే నం.10లో దిల్ కంపెనీ వారు వారికి కేటాయించిన భూమిని వదిలేసి తాము సాగు చేసుకుంటున్న భూమిలో ప్రహరీ నిర్మాణం కోసం జేపీతో వచ్చి చదును చేస్తున్నారని తెలిపారు. రైతులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తమ భూమి పైకి వచ్చినవారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చేస్తానని తహసీల్దర్ చెప్పారని వారు తెలిపారు.



తహసీల్దార్ వినయ్‌సాగర్‌కు వినతిపత్రం అందజేస్తున్న విజయ్‌కుమార్

## డీలర్‌ను సస్పెండ్ చేయాలి

మాడ్గుల, మే 24 : మండల పరిధిలోని ఆర్కపల్లి గ్రామ రేషన్ డీలర్ లక్యా నాయక్‌పై బీఆర్ఎస్ పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు జర్పుల విజయ్‌కుమార్‌నాయక్ శనివారం మాడ్గుల తహసీల్దార్ వినయ్‌సాగర్‌కు వినతి పత్రం అందజేశారు. రేషన్ డీలర్ శుక్రవారం జర్పుల తండా గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ నాయకుడిలా ప్రొసీడింగ్‌లు అందజేశారని, డీలర్ బాధ్యత మరిచి రాజకీయ నాయకుడిలా వ్యవహరించిన డీలర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

## పంట మార్పిడి విధానం పాటించాలి

**వ్యవసాయ శాస్త్రవేత్తలు రజనీకాంత్, అరుణశ్రీ**

ఇబ్రహీంపట్నం, మే 24 : వర్షాకాలం పంటల సాగులో రైతులు పంటల మార్పిడి విధానం పాటు అవసరం మేరకే పురుగుల మందులు పిచికారీ చేయాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు రజనీకాంత్, అరుణశ్రీ అన్నారు. శనివారం ఇబ్రహీంపట్నం వ్యవసాయశాఖాధికారి విద్యాధరి ఆధ్వర్యంలో మండల పరిధిలోని ముకునూరు రైతు వేదికలో రైతులకు పంటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో వెటర్నరీ అధికారి ఆనంద్‌రెడ్డి, ఏఈవో సృజన, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



పంటల సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న రజనీకాంత్

## మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం విఫలం

**సీపీఐ మండల కార్యదర్శి సత్తిరెడ్డి**

చేవెళ్ల రూరల్, మే 24 : ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ మండల కార్యదర్శి సత్తిరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధి బస్తేపూర్, గుండాల గ్రామాల్లో సీపీఐ గ్రామ శాఖల మహాసభ కార్యక్రమం పార్టీ కార్యదర్శులు సత్యనారాయణ, సాయిలు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తిరెడ్డ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎక్కడ చూసినా సమస్యలే దర్శనమిస్తున్నాయని, గుంతల రోడ్లు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంలో జాప్యం వహిస్తున్నదని మండిపడ్డారు. దేశం, రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఎన్ని మారినా పేదల బతుకుల్లో మార్పు లేదని, బడా బాబులు, పారిశ్రామికవేత్తలకు మాత్రమే మేలు జరుగుతున్నదన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం అభివృద్ధి కుంటుపడిందని, స్థానిక సంస్థలకు వెంటనే ఎన్నికలు నిర్వహించి, గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మంజుల, నాయకులు పాల్గొన్నారు.



బస్తేపూర్‌లో మాట్లాడుతున్న సీపీఐ చేవెళ్ల మండల కార్యదర్శి సత్తిరెడ్డి

### నూతన కమిటీల నియామకం

సీపీఐ బస్తేపూర్ గ్రామ శాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ శాఖ నూతన కార్యదర్శిగా బొగ్గు సత్యనారాయణ, కార్యదర్శిగా పి.జంగయ్య, సభ్యులుగా లక్ష్మి, రాజేశ్, సంధ్య, సావిత్రి, వెంకటరెడ్డి, అనంతయ్య, నర్సింహులు, వెంకటయ్యను.. మండల పరిధి గుండాల గ్రామ సీపీఐ నూతన కమిటీని కూడా ఎన్నుకున్నారు. గ్రామ శాఖ కార్యదర్శిగా సాయిలు, సహాయ కార్యదర్శిగా సత్తయ్య నియమితులయ్యారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న పట్నం మహేందర్‌రెడ్డి

షాబాద్, మే 24 : ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలను ఆదుకుంటామని తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని ఆయన నివాసంలో చేవెళ్ల నియోజకవర్గానికి సంబంధించి సీఎంఆర్ఎఫ్ కింద చేవెళ్ల మండలం గొల్లగూడ గ్రామానికి చెందిన మోతే రామకోటికి రూ.50వేలు, రాఘవేందర్‌కు రూ.50వేలు, హరికిషన్‌కు రూ.60వేల చెక్కును అందించారు. నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్న షాబాద్‌కు చెందిన కమ్మరి శ్రీను సోదరుడికి రూ.1.50లక్షల ఎల్వోసీ మంజూరు చేయించి అందజేశారు.



గుంతల రోడ్డుపై నిరసన తెలుపుతున్న శంకర్‌పల్లి సేవా ఫౌండేషన్ సభ్యులు

## రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

చేవెళ్ల రూరల్, మే 24 : శంకర్‌పల్లి నుంచి ఫతేపూర్ వరకు ఉన్న రోడ్డులో ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టాలని శంకర్‌పల్లి సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు నరేశ్‌కుమార్ మాట్లాడుతూ.. గుంతల రోడ్డుపై ప్రయాణిస్తున్న వాహనదారులు, ప్రజలు ప్రమాదాల బారిన పడినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వారు కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వేనేంద్ర చారి, సభ్యులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లతో పేదల సొంతింటి కల సాకారం



మేకగూడలో ఇందిరమ్మ ఇండ్ల పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**పలు చోట్ల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు, లబ్ధిదారులకు అర్హత పత్రాలు, తదితర కార్యక్రమాలను ప్రారంభించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**

నందిగామ, మే 24 : ఇందిరమ్మ ఇండ్లతో పేదల సొంతింటి కలను ప్రభుత్వం సాకారం చేస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. నందిగామ మండలం మేకగూడ, సంఘీగూడ గ్రామాల్లో శనివారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం మైక్రోసాఫ్ట్ ఆధ్వర్యంలో మేకగూడ గ్రామంలో ఏర్పాటు చేసిన సోలార్ లైట్లు, సీసీ కెమెరాలు, మహిళా సమాఖ్య భవనంలో ఉచిత కుట్టు మిషన్ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, మండల అధ్యక్షుడు నర్సింహ, మాజీ ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

### అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు

షాద్‌నగర్‌టౌన్ : అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు అందుతాయని ఎమ్మెల్యే అన్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటీలోని 3, 17 వార్డుల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. లబ్ధిదారులకు ఇండ్ల అర్హత పత్రాలు అందజేశారు. 22వ వార్డులో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఎమ్మెల్యే మాజీ కౌన్సిలర్ సరితతో కలిసి భూమి పూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, మాజీ చైర్మన్ విశ్వం, మాజీ కౌన్సిలర్ సర్వర్‌పాషా, నాయకులు పాల్గొన్నారు.

### నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

షాద్‌నగర్‌రూరల్ : రైతులను మోసం చేయాలని చూసినా, నకిలీ విత్తనాలు, ఎరువులు, రసాయనాలను అమ్మినవారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని ఎమ్మెల్యే హెచ్చరించారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వ్యవసాయ, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పంటల సాగుకు సమాయత్తంపై విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల డీలర్లకు నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. డీలర్లు విధిగా తమ రికార్డులను సరిచూసుకోవాలని, అదే విధంగా వ్యవసాయాధికారులు డీలర్ల దుకాణాలను తనిఖీ చేస్తూ రికార్డులను సరిచూసి నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు, శంషాబాద్ ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్, ఇన్‌చార్జి ఏడీఏ నిశాంత్‌కుమార్, ఏసీపీ లక్ష్మీనారాయణ, పలు మండలాల వ్యవసాయాధికారులు, మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, సీఐ విజయ్‌కుమార్ ఉన్నారు.

### కంప్యూటర్ శిక్షణా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కొత్తూరు : కంప్యూటర్ ఉచిత శిక్షణ కేంద్రాన్ని నిరుద్యోగులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొత్తూరు మండలంలోని ఇన్ముల్‌నర్వలో మైక్రోసాఫ్ట్ సహకారంతో యునైటెడ్ వే సంస్థ ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూట్ శిక్షణా కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతకుముందు ఎమ్మెల్యే ఇన్ముల్‌నర్వలో ఇంరిరమ్మ ఇండ్ల పనులకు శంకుస్థాపన చేశారు.

### ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లు

ఆదిబట్ల : నియోజకవర్గంలోని ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లు కేటాయిస్తామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదిబట్ల, తుర్కయాంజాల్ మున్సిపాలిటీల పరిధిలోని 822 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని బొంగుళూరులో ప్రొసీడింగ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి మండలానికి, ప్రతి మున్సిపాలిటీకి 500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత గ్యాస్, 200 యూనిట్ల విద్యుత్‌ను అమలు చేసిందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, హౌసింగ్ పీడీ డీసీ నాయక్, మున్సిపాలిటీల కమిషనర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, నాయకులున్నారు.



ఇందిరమ్మ లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

## లారీని ఢీకొన్న బైక్.. వ్యక్తి దుర్మరణం

చేవెళ్ల రూరల్, మే 24 : బైక్‌పై రాంగ్ రూట్‌లో వెళ్లి లారీ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. పరిగి మండలం ఎర్రగడ్డపల్లి గ్రామానికి చెందిన రాజపురం దేవరాజు(49) శుక్రవారం రాత్రి 7.30 గంటల సమయంలో బైక్‌పై వికారాబాద్ నుంచి చేవెళ్ల వైపు వస్తున్నాడు. మిర్జాగూడ గేటు సమీపంలోని టర్నింగ్ వద్ద రాంగ్ రూట్‌లోకి వచ్చి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో దేవరాజుకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే చనిపోయాడు. ఘటనపై చేవెళ్ల పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

## అంబేద్కర్ జాతరను విజయవంతం చేయండి

ఆమనగల్లు, మే 24 : మండల పరిధిలోని ఆకుతోటపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించే అంబేద్కర్ జాతరను విజయవంతం చేయాలని అంబేద్కర్ జ్ఞాన జాతర వ్యవస్థాపకుడు సుధాకర్, జాతర కమిటీ జిల్లా నాయకుడు విజయ్‌చందర్ తెలిపారు. శనివారం ఆమనగల్లులో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. అంబేద్కర్ విగ్రహావిష్కరణతోపాటు మహనీయుల జీవిత చరిత్ర గురించి వివరించడం.. కవులు, కళాకారుల ఆటపాటలు ఉంటాయన్నారు. నియోజకవర్గంలోని ప్రజా సంఘాలు, దళిత, బహుజన సంఘాల నాయకులు, విద్యార్థులు పెద్దఎత్తున తరలిరావాలని వారు తెలిపారు.

## పోలీస్‌స్టేషన్‌లో ఫోన్ అప్పగింత

చేవెళ్లటౌన్, మే 24 : మెహిదీపట్నం డిపో నుంచి చేవెళ్లకు వస్తున్న ఆర్టీసీ బస్సులో గుర్తు తెలియని ప్రయాణికుడు సెల్‌ఫోన్‌ను సీట్‌పై పెట్టి మర్చిపోయాడు. ఇది గమనించిన తోటి ప్రయాణికులు బస్సు కండక్టర్ మల్లేశ్‌కు అప్పగించారు. కండక్టర్ ఈ విషయాన్ని కంట్రోలర్ దృష్టికి తీసుకెళ్లగా.. పోలీస్‌స్టేషన్‌లో అప్పగించమని ఆయన చెప్పడంతో కండక్టర్ చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు అప్పగించారు. కండక్టర్‌ను పోలీసులు, ప్రయాణికులు అభినందించారు. ఫోన్ కోసం చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలన్నారు.



మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన దానగళ్ల ఎల్లయ్య(57) అనారోగ్యంతో మృతిచెందాడు. మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్ రూ.5వేలు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణగౌడ్ రూ.5వేలు, కొత్తపేట మాజీ సర్పంచ్ నవీన్‌కుమార్ రూ.4వేలు, మాజీ ఎంపీటీసీ మల్లేశ్‌యాదవ్ రూ.5వేలు, కోఆప్షన్ మాజీ సభ్యుడు జమాల్‌ఖాన్ రూ.2వేలు, కొత్తపేటకు చెందిన యువ నాయకుడు శ్రీనివాస్ రూ.5వేలను అందజేశారు. - కేశంపేట, మే 24

## కబ్జా నుంచి కాపాడాలి

ఆదిబట్ల, మే 24 : మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్ గ్రామంలో ఒక రియల్ ఎస్టేట్ కంపెనీ కబ్జాలకు పాల్పడుతున్నదని ఆ గ్రామ రైతులు ఆరోపిస్తున్నారు. కొంతమంది రైతుల వ్యవసాయ భూముల్లోకి పోవడానికి గత 80 ఏళ్లుగా నక్షబాట ఉన్నది. గత కొంతకాలంగా ఆ ప్రాంతంలోని భూములను ఓ రియల్ ఎస్టేట్ సంస్థ కొనుగోలు చేసింది. శనివారం నక్షబాటను కబ్జా చేసి దాని చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేశారు. దీంతో అడ్డుకున్న రైతులపై పోలీసుల సాయంతో బెదిరింపులకు దిగిందని ఆ రియల్ ఎస్టేట్ సంస్థపై రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి నక్షబాటను కబ్జా నుంచి కాపాడాలని రైతులు కోరుతున్నారు.